# డయాన్థస్

(ప్రబుద్ధాంధ్ర : 1935 నవంబరు)

**డ**యాన్థస్ గ్రీకు యువకుడు. అతడు పూర్వకాలమునందెప్పుడో బ్రతికియుండెను. అప్పుడు గ్రీసు దేశములో నున్న వారందరు దేవతలతో సమానులు. దేవతలు భూమిమీదికి వచ్చుట, మనుజులతో బ్రసంగించుట, యుండుచుండెడిది. ఆ కాలమెటువంటిదో కాని యీర్ష్యాసూయాది గుణములు గూడ దేవతల వలె వచ్చి మనుష్యులతో బ్రసంగించుచుండెడివి.

డయాన్థస్ మిక్కిలి యందగాడు. అట్టి ముఖలక్షణములు గాని, శరీరావయములు గాని కలిగిన వాడిప్పుడుండినచో నతనిని మనమందగాడని యనము. కాని యాదినములలో నా దేశములో నతడందగాడు. అతడు బక్కపలచగా పొడుగుగా నుండెడివాడు. అతని శరీరము మిక్కిలి సన్నన. అతడు గాలిలో నూగులాడుచు నడచును. అతనికి రంగులు గల దుస్తులన్నచో నెక్కువ యిష్టము. అతడు రోజున కొక్కొక రంగుగల ధోవతియు నుత్తరీయమును ధరించును.

అతని సౌందర్యము యొక్క ప్రశస్తి నాల్గుదెసలందు వ్యాపించెను. దేవతా స్త్రీలందరు వచ్చి యతనిని చూచి మోహించెడివారు. అతడు పుష్పసుకుమారుడు. తుమ్మెదలు వచ్చి యతని శరీరావయవములపై వ్రాలి తేనియ కనిపింపక యెగిరిపోవుచుండెడివి. అతనికి క్రమక్రమముగా తాను గొప్ప సౌందర్యవంతుడని తెలియవచ్చెను. యౌవనారంభ సమయము నుండి వాని సౌందర్యము మిసమిసలాడెను. అతని నాసిక తుద చక్కని సన్నని దిమ్మకట్టి నాసారంధ్రములు కొంచెముగా నుబికి ముక్కు పొడుగై సొగసు లొలికెను.

చెవులు నిక్కి బంగరుప్రమిదలవలె నయ్యెను. వాని కన్నులు సూదులు పెట్టి పొడిచినట్లు చూడసాగెను. అతని కనుగ్రుడ్డులో నల్లపాప–తుమ్మెదలకు ప్రేయోవిషయమును వ్రాలబోవు వానికి నతని హస్తతాడన బాధాజనకమును నైనది.

అతని పెదవి లేత యెఱ్ఱకాంతి విరజిమ్మి దినదినము క్రొత్తదియా క్రొత్తదియా యనిపించుచుండెను.

అతని చుబుకము పొట్టిదై ముద్దగా నడుమున కొద్దిగా జీలినట్లు వాని మొగమునకు క్రొత్తశోభ తెచ్చెడిది.

యౌవనాంకురముతో నతనికి మీసములు వచ్చెను. అతని యెఱ్ఱని మొగము మీద నల్లని మీసములు తుమ్మెద ఱెక్కలవలె ప్రకాశించెను.

శరత్కాలపు నదివలె నతని మనస్సు కూడ స్వచ్ఛమై యీ స్వచ్ఛత యంతయు నతని పంచేంద్రియములయందు వ్యాపించెను.

అతని సౌందర్యమును గ్రీసు దేవతలు చూడలేకపోయిరి. వాయు వీధులు పట్టలేక పోయినవి.

అతడితరులైన గ్రీసు దేశపు సౌందర్యవంతుల గూర్చి వినెను. వారిలో ఒకడు నార్సిసస్ (Narcissus). నార్సిససే యందకత్తెను బ్రేమించలేదు. ఆ యందకత్తెల నతడందకత్తెలుగానే భావించలేదట! డయాన్థస్సున కీ సంగతి తెలిసెను. డయాన్థసునకు చాలమంది స్త్రీలు అందకత్తెలుగా కనిపించిరి. నార్సిసను డయాన్థసు అందగాడనలేదట! అందుచేత అతనిమీద కోపము వచ్చినది. నందకత్తెల సంగతియే తెలియనప్పుడు అందగాడెట్లగునని డయాన్థస్సు నార్సిససును తిరస్కరించెను. వారిరువురకును సౌందర్యాభిమానమున జేసి యొకరి నొకరు చూడని విరోధము కలిగెను.

మఱియొకడు ఎండిమియాను. అతనిని చంద్రమండలాధి దేవతయైన స్త్రీ మూర్తి ప్రేమించినదట! అతడొకరేయి నిదురిచుచుండ నా చంద్రతేజో దేవత వచ్చి వానిని ముద్దిడుకొన్నదట. డయాన్థసు సర్వజగత్సృష్టిలో నున్న శైతల్య స్వచ్ఛతలకు నిధానమైన యా చంద్రజ్యోతిరంగనను దాను బ్రేమించెను. స్త్రీ సంస్థానమైన యా చంద్రతేజ స్త్రీర్థము ఎండిమియానును ముద్దుపెట్టుకొన్నదనుటను డయాన్థసునకు నెండిమియానుమీద కోపము కలిగెను.

డయాన్థసు బహుదేవతా స్త్రీలను కామించెను. సౌందర్యము యొక్క యథార్థస్వరూపమెరుగని వారాతనిని ప్రేమించలేదని యతని విశ్వాసము.

మెరుగుపట్టిన వెండిబిళ్ళలలో డయాన్థసు తన మొగము చూచుకొనును. ఆహా! అది యెంత తీర్చిన నాసిక! అల్లుకొనిన తీగవలె నా చెవులెంత

యందముగా నున్నవి! అవి కన్నులా! సూర్యతేజస్సున కభిముఖముగా నున్నట్లున్నవి. ఈ పెదవి! సర్వకామినీభోగ యోగ్యమైన బాలారుణచ్ఛవి భాసమానముగ నున్నది. ఆ చిన్ని గడ్డము! దానితో ప్రియా మూర్ధభాగమున నదిమినచో నది పులకరింపుల కవధి. అతని మీసము లతనికే యచ్చెరువు కల్పించినవి. చమరీమృగము తోక కన్న నిగనిగలాడి గాఢకాదంబినీ మూలచ్ఛవికి గేళికాస్థానమై తుమ్మెద టెక్కలకు జక్కనలు దిద్ది చివళ్ళు వంపులై వాని సొగసు పట్టరాకపోయినది. ఈ సౌందర్యము ముందు నార్సిససుది సౌందర్యమా? ఎండిమియాను దందమా? ఛీ! ఛీ! లోకము మిథ్యాప్రవాదము. నార్సిససు రాజకుమారుడు. అందుచేత లోకము వానిని బొగడుచున్నది. ఎండిమియాను తల్లి దేవత, అందుచేత చంద్రజ్యోతి వానిని ప్రేమించినది. అంతియకాని వారియెడల సౌందర్యమన్నది లేదు.

ఒకనాడు డయాన్థసు తన చెలికానితో మాటాడుచుండెను. అతనిముందు డయాన్థసు తన సౌందర్య శత్రువులను నిందించుచుండెను. "నీవు నార్సిససును గాని; యెండిమియానునుగాని యెన్నడు చూడలేదు గదా! వారందగాండ్రు కారని నీకెట్లు తెలియును?" అని మిత్రుడడిగెను. డయాన్థసునకు ఈ ప్రశ్నతో కోపము వచ్చెను. ఆ నాటితో వారి చెలిమి యంతమైనది.

**(2)**

డయాన్థసు కడుపు మండిపోదొడగినది. తాను ప్రేమించిన యే దేవతాస్త్రీయు తన్ను తిరిగి ప్రేమించలేదు. లోకమునందలి స్త్రీలందరు వానిది దేవతాసౌందర్యమని మెచ్చుకొందురు కాని ప్రేమించరు. అతని చెవులయందు నిత్యముగా నతని శత్రువుల గుణస్తుతులే పడుచుండెను. అతడీ హృదయములోని బాధకు దాళుకొనలేక పోయెను. అతని పంచేంద్రియములు నతని మనస్సును నట్టుడికి నట్లుడికిపోయెను.

డయాన్థసు జనపదములయందోర్చుకొనలేకపోయెను. ఇదివరకు తానందగాడు అనుకొనిన లోకము తన్ను వెక్కిరించుచున్నదని యతడూహించెను. వారి నతడు సర్వదా నిందించెను. అందరతో పగ పెట్టుకొనెను. దీని మూలమున నతనికి జనపదవాసము మిక్కిలి కష్టమయ్యెను. అతని నేడిపించుటకు చాలమంది మనసులో అతడందగాడని యనుకొనుచు కూడ ఛీ, ఛీ, అతడేమి యందగాడని

ఆరంభించిరి. తన గుణముచేత తెచ్చుకున్న యా విరోధము నతడు తన గుణమునకు కాక లోకము యొక్క బుద్ధి మాంద్యమున కంటగట్టెను. ఇట్లు లోకమునకు అతనికి చెడిపోయినది.

ఒకనాటి ప్రొద్దున అతడు తానడవులకు వోయినచో నీ బాధ తగ్గునని తలంచెను. వోవుచుండగా అతని యెదుట ఒక స్త్రీ నిలబడెను.

ఆమె యీర్ష్యాధి దేవత. ఆమె కన్నులరంగు ఆకుపచ్చన (Green eyed Jealousy) ఆమె యతని నడవుల లోనికి వోవద్దన్నది. తానతనిని రక్షించెద నన్నది. ఆమె నతడు వెంటబెట్టుకొని తన యింటికి వోయెను.

డయాన్థసునకు నామెమీద ప్రేమలేదు. కాని తన్నెవ్వరు ప్రేమించలేదు. ఎవ్వతయో యొక్కతె తన్ను ప్రేమించి నందుకతడు సంతోషించెను. తాను ప్రేమించవలయు ననుకొన్న కీర్తి మొదలైన దేవతలు తన్ను ప్రేమించక వోయిరన్న విచారము వాని హృదయములో నత్తుకొని వోయెను. అది యతని మొగములో నొత్తుకొని వచ్చెను. ఈ నిగూఢదుఃఖము నీర్ష్యాదేవి వొందిన యలుపపు సుఖము వాని మొగమున కలసి, వాని మొగ మొక వికారము వొందెను. భిన్న గుణములు గల వస్తువులు కలయిక వికృతి హేతువు కదా!

ఈర్ష్యను గ్రీకులు దేవత యన్నను నామెను గౌరవించలేదు. డయాన్థసు లోకమును జ్ఞానహీనమని నిందించి యా యీర్ష్యాదేవత యందఱు దేవతలకన్న గొప్పది యని వాదించెను. ఆమె యాకుపచ్చని కన్నులు చూచి లోకము భయపడెను. ఆమెను చూచి పసిరిక పామును జూచినట్లు లోకము కలతవొందెను. కాని డయాన్థసామెను కౌగలించుకొని యామె కన్నులలో నుండి యామె హృదయముదాక చూచెను.

క్రమక్రమముగా ఆమె సంయోగమువలన డయాన్థసులో మార్పు కలిగెను. ఈర్ష్యాధిదేవత మొగమతని మొగములో కలసినపుడెల్ల నతని ముఖావయవములు మార్పు జెందెను. అతని ముక్కున గూడ రంగు వచ్చెను. ఆ ముక్కు చివర తేలి యది యెఱ్ఱవాగు పసుపుగా మారెను. చివర పచ్చని సన్నని దిమ్మవలె నయ్యెను.

అతని చెవులు తీగవలె నల్లుకొన్నవి. చివళ్ళు పెరిగి నీటి ప్రబ్బలివలె నయ్యెను.

అతడు లోకము వంక జూచుట మానివేసి నిత్యము సూర్యమండలము వంకనే చూడనారంభించెను. అతని కన్నులలో తెల్లగ్రుడ్లు నారింజరంగుగా తిరిగెను. నల్లగ్రుడ్డు తెలుపురంగు కలిపిన పసుపురంగు తిరిగెను. ఆ కన్ను లంతకంతకు పెద్దవై ప్రొద్దు పొడుపు పూల వలె కనిపించెను.

అతని పెదవి లేత యెఱుపు మానలేదు. కాని దానిమీద నెర్రని బొట్లవలె చిన్ని చిన్ని మచ్చలు కలిగెను.

అతని చుబుక మాకు పచ్చరంగుగా మారెను. చివర ముద్దగా నున్న భాగము గట్టిపడి దిమ్మకట్టెను.

వాని మీసములు నారింజరంగు ప్రబలించుకొనెను. చిట్టచివళ్ళ నల్లగానే యుండెను.

ఈ మార్పు లోకము గ్రహించెను. దినదిన మతడు మునుపటి కన్న యందగాడగుచుండెనని లోకము గ్రహించినది. అతడు లోకాతిశాయి సౌందర్యవంతుడని నిస్సంశయముగా తేలినది. లోకమునందెల్ల జనులకు అతని వంకచూచుట, యతనిని పొగడుట, జన్మ చరితార్థము చేసికొనుట యనిపించినది. కాని యెవ్వరు అట్లు చేయలేదు.

కాలము గడచినది. ఈర్ష్యాదేవత పరమరాక్షసి. ఆమె యొడలి నిండ నెత్తురు లేదు. విషమున్నది. కొంతకాలమామె సంయోగము చేసినచో పురుషులు చనిపోదురు. ఆమె యొడలిలోని విషము మనుజుల యొడళ్ళలోనికి ప్రవహించి, వారు క్రమక్రమముగా క్షీణించి నశించిపోదురు.

డయాన్థసు సౌందర్యమంతయు నసలే దేవతాసౌందర్యము. ఈ దేవతా సంయోగము చేత నతని శరీర రేఖలే కాక యతని శరీరములోని రక్తబిందువులు కూడ, నస్థిచయము కూడ, ప్రేవులు కూడ, మాంసము కూడ నొకానొక దివ్యత్వమును సంపాదించుకొన్నవి. ఆ దివ్యత్వము పెరిగిన కొలది యతనిలోని మానవత్వము క్షీణింపజొచ్చెను.

ఆనాటినుండి యతని మానస మొక విచిత్రస్థితి పొందినది ఆ మానసమును అంటియున్న యైదింద్రియములు చిత్రముగా మారెను.

నేత్రములు పసుపు పచ్చదనము పొందినను నతని చూపు లాకుపచ్చ రంగుగా నుండెను. ఈర్ష్యాదేవత తన ముద్ర ఘటిల్లెనని సంతసించెను.

నాసిక యూదారంగుగా నున్నను జిట్టచివర నాకు పచ్చదిమ్మ కట్టెను.

చెవులు నీటిప్రబ్బలివలె నీలపురంగుగా మారినను నొక విధమైన యాకుపచ్చని రంగు వానియంతటా నావరించి యుండెను.

అతని నాలుక యాకుపచ్చని రంగు పొందెను. అతడు సామాన్యముగ నోరు తెఱువడు. ఈర్ష్యాదేవత రహస్సంగమవేళ – నీర్ష్యయతని పెదవి ముద్దాడి, నోరులో నోరు పెట్టి తన దంతములచేత నతని జిహ్వాగ్రమును కొరికి యతడు కొంచెము బాధపడగా నొచ్చుకొని బతిమాలి నాలుక చాపించి చూచెను. అతని ప్రాణములో తాను స్థిరపడినందుకు మిక్కిలి సంతోషించెను.

అతని శరీరమంతయు నాకు పచ్చని రంగు తిరిగెను.

**(3)**

ఒకనాటి ప్రొద్దున దయాన్థసు ఈర్ష్యతో పోట్లాడెను. "ఛీ! ఛీ! నీ మూలమున చెడిపోతిని. మా బంధువులందరకు దూరమైతిని. నేను మానవుడను. మానవలోకమున నెడమై పోతిని. నీవు యేగడియ నాయొద్దకు వచ్చితివో యాగడియ కన్న పాపపు గడియలేదు. నీవు దేవతవు. నీకు కనిపించుచున్న యీ శరీరము నిజమైనదికాదు. నీవీ శరీరమును లీలగా గ్రహించితివి. నీతో సంపర్కము చేసి నేను మానిసిగా నుండుట మానివేసి యొక భావముగా తయారైతిని. నన్ను నావారు మెచ్చుకొనుట లేదు" అనెను.

ఈర్ష్య యతని వంక నిదానించి చూచెను. తానిన్నాళ్ళతనితో కాపురము చేసినను ప్రధానమైన యతని మనస్సు వికారము పొందలేదు. యతని యాత్మ మార్పు పొందలేదు. అది దుంపజాతి. అతని పంచేంద్రియములును మనస్సును తన సంపర్కము చేత మాఱినను వానియందు మార్పు పొందని యాత్మలక్షణమై యొక తెల్లన భాసించుచునే యుండెను.

ఈర్ష్య తన యధికారపు హద్దు తెలిసికొని లేచిపోయెను.

ఈర్ష్య లేచిపోయిన సంగతి డయాన్థసు లోకమునకు తెలియపరచలేదు. అతనికి లోకము మీద నొకవిధమైన కోపము వచ్చినది. ఈర్ష్య తన యింట నున్నంత మాత్రమున తనతో పుట్టిన మానవజాతి తన్నింత తిరస్కరింపవలయునా? అని వారి వంక చూడలేదు. ఈర్ష్య తాత్కాలికముగ లేచిపోయినదనియో, యతని యింటిలోననే యున్న దనియో లోకము తలంచి అతని వంక చూడలేదు.

డయాన్థసునకు మనసు తిరిగెను. సౌందర్యము భూలోకమున కలంకారప్రాయమైనది. తానింతటి సౌందర్యము కలవాడై లోకమునకు మేలేమి చేసెను? లోకము తన్ను తిరస్కరించిన మాట నిజమే. తాను వారికేల యుపయోగపడరాదు? తన పేరు మీద మహాసుందరమైన యొక శాఖను మానవజాతిలో సృష్టింపలేదు. తన సృష్టి యిట్లు వృథాయై పోయెను. ఈ దిగులులో అతడు కొంత చివికి యొకనాటి సాయంకాలమున బ్రాణము చల్లనగుట కొక సరస్తీరమున చేరెను. అందు కూర్చున్నవాడు కూర్చున్నట్లు క్రుంగిపోయెను.

**(4)**

చాలకాలము గడచెను. అతని శరీరమును మృగములు, పక్షులు, పురువు లేమియును ముట్టలేదు. హారతి కర్పూరము వలె నది హరించిపోయెను. అతని శరీరమొకచోట, శిరసొకచోట బడెను... అతని ముఖావయవముల నుండియు, అతని యింద్రియముల నుండియు చక్కని పూలమొక్కలు పుట్టెను. ఒకొక్క యక్షరమున కొక్కొక్క మొక్కగా బయలుదేరి యతని సౌందర్యమును లోకముచేత ఒప్పించెను.

**D డయాన్థస్** : అతని శరీరము పడినచోట అతని పేరుతోనే యొక పూ మొక్క మొలిచెను. అతని శరీరము వలె నది కూడ నొక వెడల్పైన గటికవలె నున్నది. అతడు రంగుపూలు గల దుస్తులు ధరించినట్లు మొక్క రకరకాల రంగుల పూలు పూచును.

**I ఇసోమియా** : అతని చెవులు పడినచోట ఇసోమియా యను పూలమొక్క మొలిచెను. దాని పూవులు నీలి గరిటెల వలె నుండును. అవి నీటి ప్రబ్బలి పూలవంటివి.

**A - ఎమోరిలిస్** : అతని పంచేంద్రియములను, అతని మనస్సును కలసి దాని యాకులుగా, అతని యాత్మ దుంపగా, నీ పేరుగల దుంపజాతి మొక్క పుట్టెను. దానికాఱు రేకులుండును. ఇవియే యతని పంచేంద్రియములు, మనస్సును. అతని యుడికిపోయిన యెదవలె దుంప యెఱ్ఱగా నుండి యాఱురేకులు నీర్ష్యచేత నాకు పచ్చనై పశ్చాత్తాపము వలన కలిగిన తెల్లదనము చారవలె ప్రతి రేకులో నుండును.

**N - నెస్టూరియమ్** : అతని మీసాల మొదటి నారింజరంగు, చివరి నల్లదనము. నీ పూవు యొక్క పూవులవలె భాసించెను. ఈ మొక్క బంగారు రంగుపూలు పూచును. దాని రేకులు తుమ్మెదఱెక్కల వలె నుండును.

**T - టెబిరోజ్** : ఇది యతని చుబుకము. ఇది యతిని గడ్డము వలె పొట్టిమొక్క. ముద్దుపూలు పూచును. యేటేట అది తొందరగా పూచునది. తరుముకొని వచ్చి యతని గడ్డపు సొగసు దానిలో కనిపించును.

**H - హెలియోట్రోప్** : ఇది యతని నాసిక. పూవు ఊదారంగు పూవులో నెఱ్ఱవాగు పసుపురంగు కూడ గలదు. లోపలి దిమ్మలు పచ్చనివి, సన్ననివి.

**A - అర్సీనియా** : అతని నేత్రము లీ మొక్కగా జన్మించెను. ఈ మొక్క క్రమక్రమముగా మన దేశమునకు కూడ వచ్చినది. దీనిని మనము ప్రొద్దు పొడుపు పూలయొక్క యందుము. అతడు బ్రతికియున్నప్పుడు నిత్యము సూర్యుని వంకనే చూచుచుండుటచేత దాని పూలెప్పుడును సూర్యుని వంకకే తిరుగుచుండును. అతని లోతుకన్నులను సూచించుటకా మొక్క పొట్టిదిగా నుండెను. అతని కన్నుల వోలె పూలు నారింజరంగు. నల్లగ్రుడ్డీర్ష్య వలన నెఱుపు తిరుగుట చేత నాయెరుపు పూవులోన కనిపించుచునే యుండును.

**S - సెపానేరియా నక్కారియా** : ఇది యతని పెదవి. ఇది ప్రతియేట జచ్చిపోవును. మఱల బుట్టును. ఇది కష్టము చేత పెంచదగిన మొక్క. (Harby Annual) ఈ మొక్క పూవురంగు అతని పెదవివలెనే లేత యెరుపు. ఈర్ష్యాదేవి దంతములు నొక్కగా పుట్టిన నెత్తురు చిన్నిచిన్ని యెఱ్ఱని బొట్లుగా నా పూవు మీద నిప్పటికిని కన్పించుచునే యుండును. సౌందర్యవతులైన బహుకామినీ

భోగయోగ్య మగునది యని కాబోలతని పెదవినుండి పుట్టిన యీ మొక్క పూవును ప్యారీ నగరములో స్త్రీలు మిక్కిలిగా వాడుదురు. వారికి దీని పూవులన్నచో మిక్కిలి యిష్టమట.

* * *

అతడు చనిపోయిన తరువాత లోకమంతయు నతనిని గుఱించి పొగడెను. ఈర్ష్యాహతబుద్ధియైనను ఆత్మలో సత్పురుషుడైన యతడు లోకమునకీ విధముగా ఉపకరించెను.

ఇప్పటికిని డయాన్థస్ పూవు మొక్క యున్నచోట తోటమాలు లెవడో పురుషునితో మాట్లాడు చున్నట్లు నొకని కెదురుగా నిలుచున్నట్లు నూహింతురట!.